సాక్షి
ఆదిలాబాద్

బుధవారం । 28 । ఆగస్టు । 2024



ఎస్‌సీఆర్ జీఎంను కలిసిన ఎంపీ

ఆదిలాబాద్: దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను ఎంపీ గోడం నగేశ్ మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో ఆయనను కలిసి పలు రైల్వే అభివృద్ధి పనులపై చర్చించారు.



ఏజెన్సీ బంద్ ప్రశాంతం

9లో▸


తుడుందెబ్బ ఇచ్చిన పిలుపు మేరకు ఏజెన్సీ ప్రాంతంలో బంద్ విజయవంతమైంది. ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు నుంచి ఐబీ మీదుగా ఆదివాసీలు ర్యాలీగా తరలివచ్చి ఐటీడీఏ ఎదుట బైఠాయించారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

నేడు 'సాక్షి' ఫోన్ ఇన్



జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఆయా గ్రామాలు, పట్టణాల్లో వైరల్ డెంగీ, చికున్ గున్యా, తదితర జ్వరాలతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. సీజనల్ వ్యాధులపై బుధవారం 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ వివరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 98480 57606 నంబర్‌లో సంప్రదించి వైద్య సలహాలతో పాటు సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

న్యూస్‌రీల్

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో

ఆదిలాబాద్: విధి నిర్వహణలో బిజీగా ఉండే ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడాపోటీలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం ప్రభుత్వ ఉద్యోగుల జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాతీయ క్రీడా దినోత్సవం నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్, చెస్, టేబుల్‌టెన్నిస్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, నడక, పరుగు పందెం వంటి క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. మంగళ, బుధవారాల్లో పోటీలు కొనసాగుతాయని, ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్ శిక్షకులు రాజు, సాయి, రమేశ్, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

కైలాస్‌నగర్: కళాశాలల్లో ర్యాగింగ్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో యాంటి ర్యాగింగ్ నియంత్రణపై ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లలో తెలియని అప్లికేషన్స్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో వ్యక్తిగత సమాచారం నమోదు చేయవద్దన్నారు. ర్యాగింగ్ నియంత్రణకు సంబంధించి టోల్‌ఫ్రీ నంబర్ 1800–180–5522 లేదా helpline@antiragging. in లేదా డయల్ 100కు సమాచారమందించాలని సూచించారు.

'జోగు రామన్న చిల్లర రాజకీయాలు మానుకోవాలి'

కైలాస్‌నగర్: తనపై తప్పుడు విమర్శలు చేయించడం జోగు రామన్న రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. స్థానిక ప్రజాసేవభవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రుణమాఫీ విషయంలో బీఆర్‌ఎస్ నాయకుల వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. మాజీ మంత్రి రామన్న చిల్లర రాజకీయాలు మానుకుని తన చెంచాల ద్వారా తప్పుడు ప్రచారం ఆపాలన్నారు. లేనిపక్షంలో 30 ఏళ్లలో నియోజకవర్గంలో ఆయన చేసిన అవినీతి, అక్రమాల చిట్టా బయటపెడుతామని హెచ్చరించారు. తనపై లేనిపోని విమర్శలు చేస్తున్న రామన్నకు చిత్తశుద్ధి ఉంటే ఆయన స్వగ్రామం దీపాయిగూడ హన్మాన్ ఆలయం వద్ద బహిరంగచర్చకు రావాలని సవాలు విసిరారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు వెంకన్న, నర్సింగ్, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

నిర్ధారణకు వేళాయె

- 'రుణమాఫీ'లో మరో ఘట్టం
- రేషన్‌కార్డు లేని వారిపై ఫోకస్
- కుటుంబ సభ్యుల గుర్తింపునకు సర్వే
- ప్రభుత్వం నుంచే ఫ్యామిలీ డాటా
- దాని ఆధారంగా వారి ఇళ్లకు వెళ్లి సర్వే
- ఇప్పటికే ట్రయల్ పూర్తి.. నేటి నుంచి అధికారికంగా



తాంసి మండలం బండల్‌నాగాపూర్‌కు చెందిన చంద్రాల పొచ్చుబాయి–కిషన్ భార్యాభర్తలు. ఇద్దరి పేరిట గ్రామ శివారులో ఉన్న 11 ఎకరాల్లో సాగు చేసుకుంటున్నారు. కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో వ్యవసాయ రుణం తీసుకున్నారు. అయితే ప్రభుత్వం ఇటీవల చేపట్టిన మూడు విడతల రుణమాఫీలో వీరికి అవకాశం దక్కలేదు. దానికి కారణం రేషన్‌కార్డు లేకపోవడమేనని అధికారులు చెప్పారు. కుటుంబ సభ్యుల పరంగా రూ.2లక్షల్లోపు ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నందున రేషన్‌కార్డు లేకపోవడంతో వీరి ఫ్యామిలీ నిర్ధారణ కాకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారి సర్వే ట్రయల్‌లో భాగంగా వారి ఇంటి వద్దకే వచ్చి ఆన్‌లైన్‌లో వారి వివరాలు నమోదు చేశారు. అధికారి ఆ కుటుంబ సభ్యులతో కలిసి ఇలా సెల్ఫీ దిగి అప్‌లోడ్ చేశారు. అంతే కాకుండా వారిచ్చే వివరాలకు సంబంధించి ఒక అఫిడవిట్ కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు.



రైతు కుటుంబ నిర్ధారణ కోసం ఆన్‌లైన్‌లో ఫొటోతో పాటు అప్‌లోడ్ చేసిన వివరాలు

సాక్షి,ఆదిలాబాద్: మూడు విడతల రుణమాఫీ తర్వాత జిల్లాలో అనేక మంది రైతులు తమ రుణం మాఫీ కాలేదని ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. వివిధ కారణాలు, సాంకేతిక సమస్యలతోనే ఇలా జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు అన్నదాతలకు తెలియపరుస్తూ వచ్చారు. ఇదిలా ఉంటే అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం మరోసారి ప్రకటించింది. అంతే కాకుండా మండలాల వారీగా వ్యవసాయ అధికారులు నోడల్ ఆఫీసర్లుగా నియమించి రైతు వేదికల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఇదిలా ఉండగానే తాజాగా ప్రభుత్వం రేషన్‌కార్డు లేనటువంటి కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం సర్వేకు ఆదేశించింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వమే ఆయా కుటుంబ సభ్యుల డాటాను పంపించింది. ఈ సమాచారంను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మండలం వారీగా నోడల్ అధికారులకు చేరవేశారు. ఈ డాటా ఆధారంగా వారు రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో ఆయా రైతు కుటుంబ సభ్యుల ఇళ్లకు వెళ్లి నిర్ధారణ ప్రక్రియకు సంబంధించి ట్రయల్ రన్ చేపట్టారు. బుధవారం నుంచి అధికారికంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తద్వారా జిల్లాలో రేషన్‌కార్డు లేకుండా రుణమాఫీకి అనర్హతకు గురైనటువంటి కుటుంబ సభ్యులను గుర్తించి ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. ఆ తర్వాత అక్కడినుంచి వచ్చే ఆదేశాల ప్రకారం రుణమాఫీ నిర్ధారించనున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో 18 మండలాలు ఉండగా, అత్యధికంగా ఆదిలాబాద్‌అర్బన్‌లో రైతులకు సంబంధించి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉంది. మావలలో బ్యాంకు లేకపోవడంతో అక్కడ రైతుల సంఖ్య నమోదు కాలేదు. ఇక్కడి రైతులు ఇతర మండలాల్లోని బ్యాంకుల్లో ఖాతాలు ఉండడంతో ఈ పరిస్థితి ఉంది. మిగతా మండలాల పరంగా పరిశీలిస్తే.. ఒక్కో మండలంలో సుమారు 250 మంది నుంచి 500లోపు రైతు కుటుంబాలకు సంబంధించి వివరాలు పంపించడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వం పంపిన కుటుంబ సభ్యుల వివరాలు..
జిల్లాలో రేషన్‌కార్డు లేనటువంటి రైతులు : 11వేలకు పైగా
అత్యధిక రైతులు ఉన్న మండలాలు: ఆదిలాబాద్‌అర్బన్ (1952 మంది)
అసలుకే రైతులు లేని మండలం: మావల (జీరో)

ఇదీ పరిస్థితి..

జిల్లాలో రైతు రుణమాఫీకి సంబంధించి మొదటి, రెండో, మూడో విడతలు కలిపి మొత్తంగా 55,961 మంది రైతులకు సంబంధించి రూ.608.88 కోట్ల మాఫీ జరిగింది. రూ.2లక్షల లోపు రుణం ఉన్న రైతులకు మాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో వివిధ కారణాలతో వందలాది మంది రైతులకు మాఫీ కాలేదు. దీంతో జిల్లాలో పలుచోట్ల రైతులు ఆందోళనలు చేపట్టారు. ప్రతిపక్షాలు అధికార పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అర్హుడైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని, కాలేదని ఆందోళన పడొద్దంటూ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తోంది. ఇప్పటివరకు వందలాది ఫిర్యాదులు అందాయి. ఇదిలా ఉండగానే ప్రస్తుతం రేషన్‌కార్డు లేని వారి విషయంలో ప్రభుత్వం సర్వే చేపడుతుంది. ఇతర సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానటువంటి వారి విషయంలో ప్రభుత్వం తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

నేటి నుంచి సర్వే..



రేషన్‌కార్డు లేనటువంటి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాలని ప్రభుత్వం సర్వేకు ఆదేశించింది. నేటి నుంచి జిల్లాలో సర్వే చేపడుతున్నాం. మండలాల్లో నోడల్ అధికారుల ఆధ్వర్యంలో ఇది సాగుతుంది. ప్రభుత్వం నుంచే కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాల డాటా అందింది. దాని ఆధారంగా వ్యవసాయ శాఖ అధికారులు వారి ఇంటివద్దకే వెళ్లి వివరాలు నమోదు చేస్తారు. వాటిని ప్రభుత్వానికి పంపిస్తాం. – శ్రీధర్‌స్వామి, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

తెగిన పేగు బంధం
వీడని రక్త బంధం



అక్షయ్ మృతదేహం
విజయ్ మృతదేహం
ఆకాశ్ మృతదేహం

తమ్ముడూ.. నువ్వులేకుంటే మేమెట్ల బతుకతామనుకున్నారో ఏమో.. ఈత రాకున్నా ప్రాణాలకు తెగించారు ఆ అన్నలు. ఎలాగైనా తోబుట్టువును రక్షించాలని భావించారు.. అయితే వారి ప్రయత్నాన్ని విధి అడ్డుకుంది. ముగ్గురినీ నీటి మాటున మింగేసింది. తిరిగిరాని లోకాలకు చేర్చింది. కన్నవారికి కడుపుకోత.. కట్టుకున్న వారికి పుట్టెడు దుఃఖం మిగిల్చిన ఈ ఘటన హృదయ విదారకం.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- వాగులో గల్లంతైన అన్నదమ్ముళ్లు
- తమ్ముడిని రక్షించబోయి ఇద్దరన్నలూ మృతి
- ముగ్గురి ప్రాణాలు తీసిన చేపల వేట
- ఉపాధి కోసం వచ్చి అనంత లోకాలకు..

ఆదిలాబాద్‌రూరల్/ఆదిలాబాద్‌టౌన్: సొంత ఊరిని వదిలి ఉపాధి నిమిత్తం వలస వచ్చిన ముగ్గురు అన్నదమ్ముళ్లు కానరాని లోకాలకు వెళ్లిపోయారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న వీరు మంగళవారం ఖాళీగా ఉండడంతో సరదాగా చేపల వేట కోసం వెళ్లి విగతజీవులుగా మారారు. ఈత రాకపోవడం, కళ్ల ముందే తమ్ముడు నీటిలో కొట్టుకుపోతుండడంతో ఇద్దరు సోదరులు అతన్ని రక్షించే ప్రయత్నం చేశారు. వారికి సైతం ఈత రాకపోవడంతో ముగ్గురూ గల్లంతయ్యారు. వారితో పాటు వెళ్లిన మరో వ్యక్తి నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. అరుపులు, కేకలు వేసినప్పటికీ చుట్టుపక్కల ఎవరూ అందుబాటులో లేరు. అప్పటికే ఘోరం జరిగిపోయింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ముళ్లు మృతిచెందడంతో ఆ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఆ తల్లికి కడుపు కోత మిగలగా, వారి కుటుంబాలు వీధినపడ్డాయి.

కూలీ పనుల కోసం వచ్చి..

మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన నాగుల్వార్ రాజు–మీనాబాయి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్దవాడు విజయ్(28). మరోఇద్దరు ఆకాశ్ (26), అక్షయ్(22). ముగ్గురు అన్నదమ్ముళ్లు ఉపాధి నిమిత్తం ఆదిలాబాద్ జిల్లాకు ఇటీవల వలస వచ్చారు. తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామానికి వారం క్రితం చేరుకున్నారు. ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. సొంత ఊరిలో ఉపాధి కరువై పొట్టచేత పట్టుకొని వచ్చిన వీరి కుటుంబంలో పది రోజులు గడవక ముందే విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ముగ్గురికి వివాహాలయ్యాయి. అక్షయ్‌కు ఆరు నెలల క్రితం పెళ్లి జరిగింది. విజయ్‌కు 10 నెలల కుమారుడు ఉన్నాడు.

ప్రాణం తీసిన చేపల వేట..

సరదాగా చేపల వేట కోసం వెళ్లిన అన్నదమ్ముళ్లు వాగులో గల్లంతై మృత్యువాత పడ్డారు. ఉదయం 10.30 గంటల సమయంలో ఊరికి ఆనుకొని ఉన్న పొచ్చర వాగుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో అక్షయ్ ప్రమాదవశాత్తు కాలుజారి వాగులో పడ్డాడు. కళ్ల ముందే తమ్ముడు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంటే చూసి ఈత రాకపోయినప్పటికీ ఆ అన్నదమ్ములిద్దరు వాగులోకి దూకారు. తమ్ముడిని రక్షించబోయి వారు సైతం గల్లంతయ్యారు. పోలీసులు వచ్చి గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీశారు. రూరల్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

వీధినపడ్డ కుటుంబం..

ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ముళ్లు మృతిచెందడంతో ఆ పేద కుటుంబం రోడ్డున పడింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారులు ఒకేసారి మరణించడంతో తల్లిదండ్రులతో పాటు కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. సంఘటనస్థలంలో వారు రోదించిన తీరు కంటతడి పెట్టించింది. విషయం తెలియడంతో బండల్‌నాగాపూర్, పొచ్చర, దిమ్మ, తదితర గ్రామాల ప్రజలతోపాటు పలువురు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.

అర్హతకు మించి వైద్యం అందించొద్దు

- డీఎంహెచ్‌వో కృష్ణ

ఆదిలాబాద్‌టౌన్: ఆర్‌ఎంపీ, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం అందించవద్దని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు ఫస్ట్ ఎయిడ్‌కేంద్రం అని మాత్రమే బోర్డు పెట్టాలని, ఆస్పత్రి, క్లినిక్ అని బోర్డు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోవద్దన్నారు. క్లినిక్‌లలో ఇంజక్షన్లు,సెలైన్‌లు,బెడ్లు ఏర్పాటుచేయవద్దన్నారు. ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రులకు వెళ్లేలా సూచించాలని పేర్కొన్నారు. క్లినిక్‌లకు అనుబంధంగా మెడికల్, ల్యాబ్‌లు ఏర్పాటు చేయవద్దన్నారు. ఇందులో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి శ్రీధర్, ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామోజీవీరాచారి, శంకర్, సంఘ బాధ్యులు రమేశ్,భోజారెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయ సమస్యల పరిష్కారానికి కృషి

- సెంట్రల్ లైబ్రరీని పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా



నిరుద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్: గ్రంథాలయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీలో స్లాబ్ ప్రమాదకరంగా మారిందని, తలుపులు, కిటికీలు సక్రమంగా లేవని, స్టడీ మెటీరియల్ పూర్తిస్థాయిలో అందుబాటులో లేదని, విద్యుత్ కోత వంటి సమస్యలను వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కుర్చీలు సైతం తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ స్పందిస్తూ విడతలవారీగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట గ్రంథాలయ కార్యదర్శి బుగ్గారెడ్డి, లైబ్రేరియన్ శ్రీనివాస్, సతీష్, రికార్డు అసిస్టెంట్లు కిరణ్, వంశీ, హన్మంతు తదితరులున్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలి

కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాలో మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించేందుకు సంబంధిత శాఖాధికారులు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తన కార్యాలయ చాంబర్‌లో ఎక్సైజ్, రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ తదితర శాఖల అధికారులతో మత్తు పదార్థాల నివారణ అంశంపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సేవించే వారిని యూరిన్ టెస్ట్ (టీజీఏఎన్‌బీ) ద్వారా గుర్తిస్తున్నట్లు తెలిపారు. రైతులు గంజాయి సాగు చేయవద్దని సూచించారు. ఒకవేళ సాగు చేస్తే ప్రభుత్వ పరంగా వచ్చే ప్రయోజనాలను నిలిపివేస్తామన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ గంజాయి వినియోగదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. మహారాష్ట్ర సరిహద్దులోని రైలు, రోడ్డు మార్గాలలో విక్రయదారులు ప్రయాణిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. వాటిని అడ్డుకునేందుకు జిల్లా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిఘ్యాన్ మాల్వీయా, అదనపు ఎస్పీ సురేందర్ రావు, ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ప్రాంతాలను గుర్తించాలి

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల వద్ద ప్రమాదాలు అరికట్టేలా స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటుచేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖ ద్వారా డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

అక్రమాలపై పట్టింపేది?

- జిల్లాలో యథేచ్ఛగా ఆక్రమణలు
- అనుమతులు లేకుండానే లేఅవుట్లు
- టీపీవో, డీటీసీపీవోగా ఒకే అధికారి
- 'మామూలు' పర్యవేక్షణపై విమర్శలు



భీంపూర్ మండలం పిప్పల్‌కోటిలో అక్రమంగా సిద్ధం చేస్తున్న లేఅవుట్ (ఫైల్)

కైలాస్‌నగర్: జిల్లాలో అక్రమ లేఅవుట్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. ఎలాంటి అనుమతుల్లేకుండా పంట పొలాలను లేఅవుట్లుగా మార్చి రియల్టర్లు పని కానిచ్చేస్తున్నారు. అయితే ఇందులో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్, భవన నిర్మాణ అనుమతుల కోసం తిప్పలు పడాల్సి వస్తోంది. మరోవైపు గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఆక్రమణలకు సైతం అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అక్కడ, ఇక్కడ తేడా లేకుండా ప్రభుత్వ, అసైన్డ్, చెరువు, శిఖంభూములను అక్రమార్కులు అన్యాక్రాంతం చేస్తున్నారు. వీటిని కట్టడి చేయాల్సిన డిస్ట్రిక్ట్ టౌన్‌అండ్ కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్ (డీటీసీపీవో), పట్టణ ప్రణాళిక విభాగం అధికారి (టీపీవో) వంటి రెండు కీలక బాధ్యతలు ఒకే అధికారి నిర్వహిస్తుండడం గమనార్హం. కీలకమైన పదవుల్లో కొనసాగుతున్న సదరు అధికారి పర్యవేక్షణ కొరవడిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పుట్లగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు

జిల్లాలో రియల్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇటీవల ఎల్‌ఆర్‌ఎస్‌కు అందిన దరఖాస్తులను పరిశీలించిన పంచాయతీ అధికారులు జిల్లాలోని 14మండలాల పరిధిలోనే 280 అక్రమ లేఅవుట్లు ఉన్నట్లుగా గుర్తించారు. మరో మూడు మండలాలతో కలిపి ఇటీవల కొత్తగా ఏర్పడ్డ లేఅవుట్లను పరిశీలిస్తే ఈ సంఖ్య 500కు పైగానే ఉంటుందని పంచాయతీశాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రెండున్నర ఎకరాల్లోపు భూమిలో లేఅవుట్ ఏర్పాటు చేస్తే డీటీసీపీవో అనుమతి తప్పనిసరి. అయితే జిల్లావ్యాప్తంగా కేవలం 38 లేఅవుట్లు మాత్రమే అధికారిక అనుమతులు ఉన్నవి కావడం గమనార్హం. క్షేత్రస్థాయిలో పర్యటించి పంచాయతీ శాఖ అధికారులతో కలిసి అక్రమ లేవుట్లపై కొరడా ఝుళిపించాల్సిన సంబంధిత శాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఫలితంగానే రియల్ వ్యాపారులు దొడ్డిదారిన లేఅవుట్లను ఏర్పాటు చేసి యథేచ్ఛగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ, అసైన్డ్, చెరువు శిఖం భూములను ఆక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. ఆక్రమణలు, అక్రమ లేఅవుట్లకు సంబంధించి పట్టణాల్లోనైతే మున్సిపల్, గ్రామీణప్రాంతాల్లో పంచాయతీ అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – టి.వినోద్‌కుమార్, ఆదిలాబాద్ ఆర్డీవో

పట్టణంలో ఆగని ఆక్రమణలు

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఆక్రమణల దందా ఆగడం లేదు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు దానిపై గద్దల్లా వాలిపోతున్నారు. ప్రభుత్వ, అసైన్డ్, చెరువు శిఖం భూమలనే తేడా లేకుండా అక్రమించేస్తున్నారు. నిత్యం కలెక్టర్, ఎస్పీలు రాకపోకలు సాగించే కలెక్టరేట్‌చౌక్ నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు గల గాంధీ పార్కు, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రహరీతో పాటు సాక్షాత్తు మున్సిపల్ కార్యాలయాన్ని ఆనుకునే అక్రమంగా టేలాలు వెలిశాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొంతమంది రాజకీయ పలుకుబడితో స్థలాలను ఆక్రమించి టేలాలు వేసి అద్దెకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అసైన్డ్, ప్రభుత్వ, రెవెన్యూ, మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తున్న అక్రమార్కులు వాటికి దొడ్డిదారిన ఇంటి నంబర్లు పొంది రిజిస్ట్రేషన్ చేసుకుని హస్తగతం చేసుకుంటున్నారు. దీనికి తోడు పట్టణంలోనూ అనేక అక్రమ లేఅవుట్లు ఉండగా కొత్తగానూ మరిన్ని వెలుస్తున్నాయి. ఇలాంటి అక్రమణలకు చెక్‌పెట్టాల్సిన బాధ్యత పట్టణ ప్రణాళిక విభాగం అధికారులదే. కానీ ఆ దిశగా వారు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.



ఆదిలాబాద్‌లోని రెవెన్యూ గెస్ట్‌హౌస్ వద్ద అక్రమంగా వెలిసిన టేలాలు

క్లుప్తంగా

3 కిలోల వెండి ఆభరణాలు విరాళం



వెండి ఆభరణాలు అందిస్తున్న గోవింద్ కుటుంబ సభ్యులు

నార్నూర్: శ్రావణమాసం పురస్కరించుకుని మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి దోమకొండువార్ గోవింద్ (బాబు మాస్టర్) కుటుంబ సభ్యులు మంగళవారం 3 కిలోల వెండి ఆభరణాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా గ్రామపెద్దలు బానోత్ గజానంద్ నాయక్ ఆలయం వద్ద భోగ్ బండారో పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మకర్త నూర్‌సింగ్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు జ్ఞానోబా పుష్కర్, ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, తాజా మాజీ ఉపసర్పంచ్ చౌహాన్ మహేందర్, గ్రామపెద్దలు రాథోడ్ విట్టల్, రాథోడ్ దత్తారాం, ఆడే విశ్వనాథ్, చౌహాన్ బిక్కు, గజానంద్ సెట్, బాలుసెట్, మోహన్ రాథోడ్, విలాస్ ఆడే, మహేందర్ ఉన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ



సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దృశ్యం

నిర్మల్‌టౌన్: గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో గొలుసు చోరీ చేశారు. బాధిత వివరాలు ఇలా ఉన్నాయి..పట్టణంలోని ద్యాగవాడకు చెందిన నిమ్మల నాగమ్మ మంగళవారం బట్టలు ఉతకడానికి వెళ్తుంది. మంగమ్మ ఆలయం వద్ద గుర్తుతెలియని ఇద్దరు బైక్‌పై వచ్చి ఆమె మెడలో తులంన్నర బంగారం గొలుసును లాక్కెళ్లారు. కుటుంబ సభ్యులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణంలో వరుస గొలుసు దొంగతనాలతో మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్పీ జానకి షర్మిల సీసీ ఫుటేజీ విడుదల చేశారు. ఇందులో ఉన్న ఇద్దరిని ఎవరైన గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

గంజాయి విక్రేత అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి డీఎస్పీ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని విశ్వనాథ్‌పేట్‌కు చెందిన షేక్ అమెర్ సోహెల్ ఈనెల 26న ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై అశోక్ తన సిబ్బందితో కలిసి బస్టాండ్‌లో తనిఖీ నిర్వహించారు. అమెర్‌ను అదుపులో తీసుకుని తనిఖీ చేయగా 180 గ్రాముల గంజాయి లభ్యమైంది. అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పోలీసులు ఉన్నారు.

నవజాత శిశు మరణాలు తగ్గించాలి

• రిమ్స్‌ను సందర్శించిన ఐసీఎంఆర్ బృందం



నవజాత శిశువులను పరిశీలిస్తున్న ఐసీఎంఆర్ బృందం సభ్యులు



ఐసీఎంఆర్ బృందం సభ్యులతో రిమ్స్ డైరెక్టర్, వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: నవజాత శిశు మరణాలు తగ్గించేందుకు వైద్యులు కృషి చేయాలని ఐసీఎంఆర్ బృందం సభ్యుడు, ఏఐఐఎంఎస్ నియోనెటాలజిస్ట్ తాని గైనతస్ అన్నారు. సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా రిమ్స్ ఆస్పత్రిని ఐసీఎంఆర్ బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఎస్ఎంసీయూ, కేఎంసీ, లేబర్ రూమ్‌లను పరిశీలించారు. వైద్యులు, స్టాఫ్‌నర్సులు, బాలింతలు, గర్భిణుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాజెక్ట్ రిసెర్చ్ మూడేళ్ల పాటు ఉంటుందన్నారు. జిల్లాలో నవజాత శిశు మరణాల రేటు 8.5 ఉండగా, దాన్ని మరింతగా తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఐసీఎంఆర్ బృందం సభ్యులు మోహన్ సుందరి, అమ్లిన్, మనోజ్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, డీఎంహెచ్‌వో కృష్ణ, డీఐవో వైసీ శ్రీనివాస్, పీవోడీటీటీ నరేందర్ రాథోడ్, రిమ్స్ వైద్యులు తదితరులు ఉన్నారు.

దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

• వివరాలు వెల్లడించిన ఏఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్

ముధోల్: మండల కేంద్రంలోని మాధవ్‌నగర్‌లో వెంకటేశ్ ఇంట్లో జరిగిన దొంగతనం కేసును మంగళవారం పోలీసులు ఛేదించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏఎస్పీ అవినాష్‌కుమార్ ఈమేరకు వివరాలు వెల్లడించారు. ఈనెల 23న వెంకటేశ్ తన ఇంటికి తాళం వేసి వివాహ వేడుకకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఇంటికి వేరే తాళం ఉంది. అనుమానం వచ్చి లోనికి వెళ్లి బీరువాలో 7.5 బంగారు ఆభరణాలు చోరీకి గురైందని పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆయన ఆదేశాలతో ఎస్సై సాయికిరణ్ కేసు దర్యాప్తు చేశారు. బాధితుడి ఇంట్లో అద్దెకు ఉంటున్న భార్యభర్తలే దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అదుపులో తీసుకున్నారు. వారి నుంచి 7.5 తులం బంగారం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్సై సాయికిరణ్, డబ్ల్యూ పీసీ రాజమణిని ఏఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్సై గంగారాం, హెడ్‌కానిస్టేబుల్ రాజారాం, కానిస్టేబుల్ నరేందర్‌చారి, గణేశ్ పాల్గొన్నారు.

బాలుడికి ఆపన్నహస్తం



నగదు అందజేస్తున్న మౌనిష్‌రెడ్డి

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన మంగలి (చుక్కల్వార్) ప్రశాంత్ కుమారుడు (25 రోజుల వయస్సు) బొడ్డు వద్ద ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. ఆదిలాబాద్‌లోని నియోకేర్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రశాంత్ తల్లి అనిత (లస్మా) సామాజిక వేత్త ముడుపు మౌనిష్‌రెడ్డికి ఫోన్‌లో విషయం తెలపడంతో ఆయన స్పందించారు. శిశువును అంబులెన్స్‌లో యావత్మల్‌లోని ఆస్పత్రికి సొంత ఖర్చులతో తరలించడంతోపాటు బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

29న బాసర ఆలయ హుండీ లెక్కింపు

బాసర: బాసర శ్రీ జ్ఞానసరస్వతి ఆలయంలో ఈనెల 29న హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ ఈవో విజయరామారావు ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి కానుకగా భక్తులు సమర్పించిన హుండీని ఉదయం 9 గంటలకు లెక్కిస్తారని పేర్కొన్నారు. శ్రావణమాసం సందర్భంగా ఈనెల 30న అమ్మవారి ఆలయ సన్నిధిలో వైదిక బృందం ఆధ్వర్యంలో ఉచిత సామూహిక లక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గొలుసు లాక్కోటానికి యత్నించిన వ్యక్తి అరెస్టు

నిర్మల్‌టౌన్: మహిళ మెడలో గొలుసు లాక్కోటానికి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని తోకల లక్ష్మి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి గాజుల్‌పేట్‌లోని తన ఇంటికి వెళ్తుంది. స్థానిక ధర్మసాగర్ చెరువు కట్టపై చిట్యాల మురళి ఆమెపై దాడి చేసి మెడలో బంగారు పుస్తెల తాడు లాక్కోవడానికి యత్నించాడు. ఆమె గట్టిగా అరవడంతో పారిపోయాడు. దీంతో పోలీసులకు సంప్రదించగా ఆర్ఎస్సైలు రవి, సాయికృష్ణ, కానిస్టేబుల్ తిరుపతి, హోంగార్డు లతీఫ్ అతడిని వెతికి పట్టుకున్నారు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉరేసుకుని హోంగార్డు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: ఆరోగ్య సమస్యలతో హోంగార్డు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ కథనం ప్రకారం.. పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన చుక్కబొట్ల మోహన్(38) గత కొన్ని రోజులుగా ఈఎన్‌టీ, ఛాతిలో కణతితో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని షెడ్‌లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో ఈనెల 22న జరిగిన దొంగతనం కేసులో నలుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కేఆర్కే కాలనీకి చెందిన పుణేశ్వరి ఈనెల 18న ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లింది. తర్వాత ఇంటికి తిరిగొచ్చేసరి బంగారంతోపాటు వెండి ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు ఎతుకెళ్లారని బాధితురాలి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు నిందితులు అశోక్ మినహా అర్బజ్, షాబాజ్, సాహెల్, వజిద్ అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు.

బాసరలో సామూహిక విద్యాలక్ష్మి వ్రతం



పూజలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

బాసర: శ్రావణమాసం మంగళవారం సందర్భంగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో సామూహిక విద్యాలక్ష్మి వ్రత పూజలను ఘనంగా నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ జ్ఞాన సరస్వతి, మహాలక్ష్మి, మహంకాళి అమ్మవార్లకు పూజలు చేశారు. విద్యార్థులకు సామూహిక విద్యా లక్ష్మీ వ్రత పూజలు చేయించినట్లు ఆలయ ఈవో విజయ రామారావు తెలిపారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీట్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 120 సీట్లకు గాను ఆలిండియా కోటాలో 15 సీట్లు కేటాయించారు. ఇందులో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టారు. ముగ్గురు విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించి ప్రవేశం కల్పించారు. ఈ ప్రక్రియ ఈనెల 29 వరకు కొనసాగుతుందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన సీట్ల అలాట్మెంట్ ఇంకా రాలేదని, త్వరలో ఆ సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో వైద్యులు కార్తీక్, లావణ్య, అంకిత్ రావు, ప్రశాంత్, సుజీత్, హరికేతన్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలను కాపాడిన పోలీసులు



మహిళను పోలీసులకు అప్పగించిన మత్స్యకారులు

బాసర: ఇద్దరు మహిళలు బాసర గోదావరిలో దూకేందుకు యత్నించగా పోలీసులు కాపాడారు. గోదావరిలో దూకే యత్నించగా మత్స్యకారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు మత్స్యకారులను అభినందించారు.

ఉరేసుకుని యువతి బలవన్మరణం



శిరీష (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా కృష్ణాకాలనీకి చెందిన ఆకుల శిరీష ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై సంతోష్, స్థానికులు తెలిపిన వివరాలు.. శిరీష (20) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో జాబ్ చేస్తుంది. గత మూడు రోజుల క్రితం కృష్ణా కాలనీలోని తన ఇంటికి వచ్చింది. తల్లిదండ్రుల మధ్య మనస్పర్థల కారణంగా విడివిడిగా ఉంటున్నారు. తనను తమ్ముడిని తల్లి కూలి పనిచేసి పోషించింది. తన కుటుంబ పరిస్థితిని, ఆర్థిక ఇబ్బందులను తలుచుకుని మానసిక వేదనకు గురైంది. మంగళవారం తల్లి కూలి పనికి వెళ్లింది. ఆమె మధ్యాహ్నం శిరీషకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వచ్చి చూసింది. శిరీష ఇంటి పై కప్పునకు చున్నీతో ఉరేసుకుంది. పోలీసులకు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి మహిళ మృతి



సాగ్రీబాయి మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని వట్టివాగు కాలువలో మహిళ ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. సీఐ సతీశ్ కథనం ప్రకారం.. మండలంలోని రౌట సంకెపల్లి గ్రామానికి చెందిన జాదవ్ సాగ్రీబాయి(32)కి మహారాష్ట్రకు చెందిన వెంకటేశ్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆరు నెలలుగా సాగ్రీబాయి మతిస్థిమితం లేకపోవడంతో తండ్రి వద్దకు వచ్చి ఉంటుంది. సోమవారం తన కుమారుడు అశ్విన్(3)తో కలిసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి ఉత్తమ్, తమ్ముడు సంతోష్ మంగళవారం కాలువ వైపు వెళ్లగా సాగ్రీబాయి మృతదేహంలభ్యమైంది. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. కుమారుడి అశ్విన్ కోసం గాలిస్తున్నారు. మృతురాలి తమ్ముడు సంతోష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన కేసులో ఒకరికి జైలు

ఆసిఫాబాద్/కెరమెరి: లైంగికదాడికి యత్నించిన కేసులో కెరమెరి మండలం అగర్‌వాడ గ్రామానికి చెందిన చాకటి భీమ్‌రావుకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జెఎఫ్‌సీఎమ్ కోర్టు మెజిస్ట్రేట్ జక్కుల అనంత లక్ష్మి మంగళవారం తీర్పునిచ్చారు. కెరమెరి ఎస్సై విజయ్ కథనం ప్రకారం.. ఏప్రిల్ 4, 2022న అగర్‌వాడకు చెందిన ఓ మహిళపై అదేగ్రామానికి చెందిన చాకటి భీమ్‌రావు లైంగికదాడికి యత్నించాడు. మహిళ అరవడడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో అప్పటి ఎస్సై కళ్యాణ్ కేసు దర్యాప్తు చేపట్టారు. పీపీ అజయ్‌కుమార్ కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టగా నేరం రుజువవడంతో న్యాయమూర్తి ఈమేరకు తీర్పుచెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన వాంకిడి సీఐ సత్యనారాయణ, కెరమెరి ఎస్సై విజయ్, ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్‌ను ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

తండాల్లో తీజ్ ఉత్సవాలు



బంజారా సమాజ్ పెద్దలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: మండలంలోని ఆయా తండాల్లో తీజ్ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హర్కపూర్, బిక్కుతండా, ఈశ్వర్‌నగర్, సకారంతండా గ్రామాల్లో నిర్వహించిన వేడుకలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరయ్యారు. బంజారా సమాజ్ కులపెద్దలు, యువతులతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు. సంస్కృతి, సంప్రదాయలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే హర్కపూర్ తండాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేశ్ రాథోడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఆర్క పుష్పలత హాజరయ్యారు. ఆయా గ్రామాల బంజారా, మథుర సమాజ్ పెద్దలు పాల్గొన్నారు.



హర్కపూర్‌లో తీజ్ నృత్యం చేస్తున్న బంజారా యువతులు

రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ బాధిత రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న బాధిత రైతులు

• ఎకరాకు రూ.40 లక్షలు చెల్లించాలని డిమాండ్

కైలాస్‌నగర్: ఫ్యాక్టరీ ఏర్పాటు పేరిట భూములు లాక్కుని తమ పొట్టగొట్టే చర్యలను మానుకోవాలని రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ బాధిత పోరాట కమిటీ అధ్యక్షుడు బండి దత్తాత్రి అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి గ్రామ రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీలో భూములను కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ధరకు భూములను తీసుకున్న యాజమాన్యం ఐదేళ్లు గడిచినా ఫ్యాక్టరీని ప్రారంభించలేదన్నారు. మరో 600 ఎకరాలు తీసుకునేందుకు రైతులకు అధికారుల ద్వారా నోటీసులు పంపించి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎకరాకు రూ. 8 నుంచి 9 లక్షలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. భూములు కావాలంటే రైతులతో బహిరంగ సమావేశం నిర్వహించాలన్నారు. ప్రస్తుతం రామాయిలో ఎకరాకు మార్కెట్ ధర రూ.40 నుంచి రూ.50 లక్షలు పలుకుతుందన్నారు. ఆ ధరతోనే భూములు తీసుకోవడంతోపాటు రెండేళ్లలో ఫ్యాక్టరీ పూర్తి చేయడంతోపాటు ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వాలన్నారు. అనంతరం జేసీ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీపీ గంగ్రత్ రమేశ్, గద్దల శంకర్, కొడప సోనేరావు తదితరులు పాల్గొన్నారు.

లింబగిరి 102 ఏళ్ల పుట్టినరోజు వేడుక



కేక్ కట్ చేస్తున్న సాదుల లింబగిరి

కుంటాల: నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రానికి చెందిన మాజీ పట్వారి సాదుల లింబగిరి మంగళవారం 102వ పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. లింబగిరి కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. గ్రామస్తులంతా ఆయన ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలుపడంతో ఇల్లంతా సందడిగా మారింది. లింబగిరి అక్షయ నామ సంవత్సరం శ్రావణమాసం అష్టమి రోజు జన్మించారని ఆయన కుటుంబ సభ్యులు ప్రతియేటా నిర్వహిస్తున్నారు. ఆయన భార్య లక్ష్మీబాయి 45 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. వీరికి ఆరుగురు సంతానం. పెద్ద కూతురు కౌసల్య అనారోగ్యంతో చిన్నప్పుడే చనిపోయింది. కూతురు సుమంగళ(67), కుమారులు సుదర్శన్(65), జనార్దన్(62), గోవర్ధన్(59), కూతురు సరోజ(49) ఉన్నారు. లింబగిరి అక్క లింబవ్వ 91 ఏళ్లు, తమ్ముడు నర్సయ్య 89 ఏళ్లు బతికారు. లింబగిరి పుట్టిన రోజున అందరూ ఒకే వేదికగా కలుస్తారు.

బకాయిలు సకాలంలో చెల్లించాలి



దుకాణాలు సీజ్ చేస్తున్న మున్సిపల్ ఆర్ఐ అనూప్

నిర్మల్‌టౌన్: మున్సిపల్ బకాయిలను సకాలంలో చెల్లించాలని చెల్లించాలని లేకపోతే దుకాణాలను సీజ్ చేస్తామని ఆర్ఐ అనూప్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాంప్లెక్స్‌లో దీర్ఘకాలికంగా బకాయిలు చెల్లించని నాలుగు దుకాణాలను మంగళవారం సీజ్ చేశారు. మిగతా షాపులకు రెడ్ నోటీసులు జారీ చేశారు. గడువులోగా చెల్లించని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు



గాయపడిన సాయికుమార్

లక్ష్మణచాంద: కుక్కలు అడ్డుగా రావడంతో బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చింతల్ చాందకు చెందిన బండలమీది సాయికుమార్, చాకలి రంజిత్ పని నిమిత్తం బైక్‌పై లక్ష్మణచాందకు వస్తున్నారు. చామన్‌పెల్లికి రాగానే కుక్కలు అడ్డుగా వచ్చి పైకి రావడంతో తప్పించుకునే క్రమంలో బైక్ అదుపుతప్పింది. ఈ క్రమంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామాల్లో వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా జీవీటీ తాలుకా టేకుమండవకు చెందిన కాంబ్లే రాంచంద్ర అదృశ్యమయ్యాడు. ఈనెల 17న హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వచ్చానని కుటుంబీకులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. తర్వాత ఫోన్ స్విచ్చాఫ్ అయిందని తెలిపాడు. అప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియడం లేదని టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ పేర్కొన్నారు.

సోదరులకు రెండేళ్ల జైలు

• నేరం రుజువుతో న్యాయమూర్తి తీర్పు

బెల్లంపల్లి: ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసిన ఇద్దరికి బెల్లంపల్లి న్యాయస్థానం మంగళవారం జైలు శిక్ష విధించింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.దేవయ్య కథనం ప్రకారం.. మున్సిపాలిటీ అంబేద్కర్ నగర్‌కు చెందిన ఎంబడి రాజేందర్ 2013లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష రాయాల్సి ఉండగా వరుసకు సోదరుడైన అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఎంబడి మల్లేశ్ హాజరయ్యాడు. పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ జి.సృజన రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అప్పటి వన్‌టౌన్ సీఐ కె.స్వామి కేసు దర్యాప్తు చేశారు. ఆ తర్వాత వచ్చిన సీఐ ఎల్.రఘు నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ కె.సురేష్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.అజయ్‌కుమార్ 12 మంది ప్రధాన సాక్షులను జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (జేఎఫ్‌సీఎం) జె.ముకేశ్ ఎదుట హాజరుపర్చగా న్యాయమూర్తి విచారించారు. నేరం రుజువు కావడంతో ఎంబడి రాజేందర్, ఎంబడి మల్లేశ్‌లకు రెండేళ్ల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.